క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సుభాష్‌నగర్: సుభాష్‌నగర్ డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలుగు తల్లినగర్‌లో రూ.15 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు సహకారంతో త్వరలో రూ.కోటి నిధులతో పలు బస్తీల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, నారాయణ, నాగేశ్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, శ్రీను, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు



పూజల్లో పాల్గొన్న రంగరాయప్రసాద్

నిజాంపేట్: ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ అన్నారు. నిజాంపేట్ బండారి లేఅవుట్‌లోని అభయాంజనేస్వామి ఆలయంలో రంగరాయప్రసాద్ ఆధ్వర్యంలో పెయింటింగ్ పనులు చేయించారు. అవి పూర్తయిన సందర్భంగా సోమవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఆలయాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని రంగరాయప్రసాద్ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంతకుమార్ ప్రకటనలో తెలిపారు.

◆ ఏపీ టైర్, నిజాంపేట్, శ్రీహోమ్స్, మావిల్లాస్, ప్రణీత్, ఎస్ఎల్‌జీ, వెంకట ప్రణీత్ ఫీడర్ల పరిధిలోని బాచుపల్లి మమత హాస్పటల్, బాచుపల్లి పోలీస్‌స్టేషన్, ఎస్‌వీఎస్ అబోర్నా, బాచుపల్లి గ్రామం, రేణుక ఎల్లమ్మ కాలనీ, ఆర్టీసీ కాలనీ, క్రాంతినగర్, శ్రీహోమ్స్ కాలనీ, నిజాంపేట్ రోడ్డు, ప్రణీత్ వ్యాలీ, ఎస్ఎల్‌జీ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు... అదే విధంగా సాయినగర్, ఎస్ఎంఎస్, మల్లంపేట్ ఫీడర్ల పరిధిలోని వీఎన్ఆర్ కాలేజీ, జీపీఆర్ లేఅవుట్, సాయినగర్, రాజీవ్‌గృహకల్ప, కేఆర్‌సీఆర్ కాలనీ, హరితవనం కాలనీ, ప్రణీత్ జెనీత్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేయించుకుంటున్న కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వర్‌నగర్‌లోని బచ్‌పన్ స్కూల్‌లో టీవీఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ కోటిరెడ్డి సౌజన్యంతో వెంకటేశ్వరనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అలవి హాస్పటల్ డాక్టర్ చంద్రశేఖర్, గైనకాలజిస్ట్ డా. కళ్యాణి, ఆశ్రయ్–ఆకృతి హాస్పటల్ డాక్టర్లు భార్గవ, సృజన, హ్యాపీచిల్డ్రన్ ఆస్పత్రి డాక్టర్ ప్రదీప్‌రెడ్డి 200లకు పైగా మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగదీప్‌గౌడ్, జనరల్ సెక్రటరీ మనోహర్, ట్రెజరర్ జ్ఞానేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 4 నుంచి మల్లికార్జున స్వామి జాతర

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడలోని శ్రీ మల్లికార్జునస్వామి జాతర ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. మార్చి 4వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు స్వామివారి జాతర కొనసాగనుందని పేర్కొంది.7వ తేదీన సాయంత్రం 5గంటలకు కొండపోచమ్మ, చిత్తారమ్మ, మైసమ్మలకు బోనాలు ఉంటాయని తెలిపింది.

మహిళ అదృశ్యం



తస్లీమ్ సుల్తానా (ఫైల్)

జీడిమెట్ల: ప్రవర్తన మార్చుకోమ్మని పెద్దలు మందలించడంతో ఓ గృహిణి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారం డివిజన్ మార్కండేయనగర్‌కు చెందిన అబ్దుల్ ఆసిఫ్‌కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య తస్లీమ్ సుల్తానా(36)కు ఇద్దరు పిల్లలు కాగా తస్లీమ్ చెడు అలవాట్లకు బానిసయ్యింది.ప్రవర్తనా మార్చుకోమ్మని భర్త పలుమార్లు మందలించాడు. అయినప్పటికీ ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో భర్త అబ్దుల్‌తో కలిసి బంధువులు 20రోజుల క్రితం తస్లీమ్‌ను మందలించారు. దీంతో ఆమె ఈనెల 13వ తేదీన చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయమై భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సర్వే నం.342/1లోని ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం



తమ ఇళ్లను కూల్చొద్దంటూ జేసీబీకి అడ్డుగా నిలిచిన మహిళలు

అధికారుల ప్లాన్.. కబ్జాదారులకు షాక్

- అక్రమ నిర్మాణాలపై పంజా
- ఎవరూ ఊహించని విధంగా కొరడా
- కబ్జాదారులు తేరుకునే లోపే నేలమట్టం

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు చలిచప్పుడు లేకుండా ఎవరూ ఊహించని విధంగా ఒక్కసారిగా పంజా విసరడంతో కబ్జారాయుళ్లు షాక్‌కు గురయ్యారు. సోమవారం రెవెన్యూ అధికారులు 70 గదులను కూల్చివేశారు. గాజులరామారంలోని దేవేందర్, కైసర్‌నగర్ సర్వే నం.342/1 ప్రభుత్వ స్థలంలో కొన్ని నెలలుగా నిర్మాణాలు వెలుస్తున్నాయి. గతంలో చాలా సార్లు వీటిని రెవెన్యూ అధికారులు కూల్చినా అదే స్థానంలో పునర్నిర్మించారు. గతంలో సాక్షి కథనానికి అప్పటి జిల్లా కలెక్టర్ హరీష్ స్థానికంగా పర్యటించారు. కబ్జాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా 342లోని 53 ఎకరాలను హెచ్‌ఎండీఏకు అప్పగించాలని అధికారులకు సూచించారు. అప్పటి నుంచి రెవెన్యూ ఉన్నతాధికారులు స్థానికంగా పలుమార్లు పర్యటించారు. తాజాగా ఫిబ్రవరి 26న జాయింట్ కలెక్టర్ నరసింహారెడ్డి గాజులరామారంలోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించి వెలిసిన రూములను తొలగించాలని ఆదేశించారు.

ఒక్కసారిగా..

గతంలో ఈ కబ్జాలపై పలుమాలు అధికారులు పర్యటించుకోవడం పోలీసు భద్రత మధ్య పదుల సంఖ్యలో కూల్చివేయడం షరామామూలు అయిపోయింది. తాజాగా ఇటీవల జాయింట్ కలెక్టర్ వచ్చి వాటిని తొలగించాలని ఆదేశించినప్పటికీ అక్కడున్న వారు షరామామూలే అంటూ తేలికగా తీసుకున్నారు. దీంతో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం 12 గంటల సమయంలో హంగు ఆర్భాటం, పోలీసు భద్రత లేకుండా జేసీబీతో కూల్చివేతలు చేపట్టారు. సర్వే నం .342/1 పినాకిని వద్ద 45 గదులు, మంజూరు నగర్‌లో 20 గదులు, హనుమాన్ టెంపుల్ వద్ద 5 గదులను నేలమట్టం చేశారు.

తేరుకునే లోపే..

సహజంగా ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాలను పెద్ద ఎత్తున కూల్చేటప్పుడు రెవెన్యూ అధికారులు పోలీసుల సహాయం తీసుకుంటారు. రెండు రోజుల ముందుగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి, కొంతమందిని అదుపులోకి తీసుకొని గుట్టు చప్పుడు కాకుండా తెల్లవారుజామున లేదా అర్ధరాత్రి కూల్చివేతలు చేపడతారు. కానీ రెవెన్యూ అధికారులు కొత్త ఫలితాలు సోమవారం అందరూ పనులకు వెళ్లగానే ఒక్కసారిగా విరుచుకపడి తమ ఆపరేషన్ విజయవంతం చేశారు. నిమిషాల్లో కూల్చివేతలు జరిగిన అనంతరం రెవెన్యూ అధికారులతో ఇళ్లను కొనుగోలు చేసిన వారు వాగ్వాదానికి దిగారు. మరికొందరు రోధనలు మిన్నంటాయి.



ఇప్పటికైనా ఆపండి..

ప్రభుత్వ స్థలంలో కబ్జాలను ఇప్పటికైనా ఆపండి. మునుముందు పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఇప్పటికే చాలాసార్లు హెచ్చరించాం. అయినా కొంతమంది కబ్జాలనే తమ వృత్తిగా మార్చుకున్నారు. మరోసారి వారి జాబితా రెడీ అవుతోంది. తొందర్లో వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

– సంజీవరావు, కుత్బుల్లాపూర్ తహసీల్దార్

పర్యావరణ సమతుల్యతకు మొక్కలు పెంచాలి



సూరారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో అటవీశాఖ అధికారులు

జీడిమెట్ల: విద్యార్థులకు అడవుల ఆవశ్యకత.. పర్యావరణ పరిరక్షణ అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత ఐఎఫ్ఎస్ ఆఫీసర్ ఆర్‌వీ రావు అన్నారు. సోమవారం అటవీశాఖ అధికారులు ×వన దర్శిని×కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూరారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను దూలపల్లి రిజర్వ్ ఫారెస్ట్, ఎస్ఆర్.నాయక్‌నగర్‌లోని ప్రశాంత వనం పార్కుకు తీసుకెళ్లారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.లక్ష్మణ్, సెక్షన్ ఆఫీసర్ జి.శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యతను.. దూలపల్లి ఫారెస్ట్‌లో ఉన్న చెట్ల ప్రాముఖ్యతపై క్లుప్తంగా వివరించారు.

పర్యావరణ పరిరక్షకు పచ్చని చెట్లే మూలం..

పర్యావరణంలో కాలుష్యాన్ని తగ్గించడంలో పచ్చని చెట్లు ముఖ్య పాత్ర పోషిస్తాయని ఆర్‌వీ రావు విద్యార్థులకు తెలిపారు. పర్యావరణం సమతుల్యంగా ఉండాలంటే విద్యార్థులు అవగాహనతో మొక్కలను పెంచాలని సూచించారు. సమాజంలో అటవీశాఖ అధికారుల ప్రాముఖ్యత వారి కర్తవ్యాన్ని సైతం విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కృష్ణమ్మ, వీరబాబు, వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామరాజునగర్ నూతన కార్యవర్గం



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ రామరాజునగర్ నూతన అధ్యక్షుడిగా కృష్ణకాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో కాలనీవాసులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావు, కోశాధికారిగా రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సతీష్, జాయింట్ కోశాధికారిగా ప్రమోద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అయ్యప్పరెడ్డి, ఉమెన్స్ కోటాలో వైస్ ప్రెసిడెంట్‌గా రాజేశ్వరి, సంయుక్త కార్యదర్శిగా రాణి, కార్యవర్గ సభ్యులుగా గోవర్ధన్, భాస్కర్, కిషోర్‌కుమార్, అనురాధ, సరళ, పార్వతి ఎన్నికయ్యారు. కాలనీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని.. ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

వైభవంగా గొల్లకేతమ్మ, బలిజ మేడమ్మ జాతర



మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: దుండిగల్‌లోని శ్రీగొల్లకేతమ్మ, బలిజ మేడమ్మల సమేత మల్లికార్జునస్వామి జాతర సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి జాతరకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ జాతరలో పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

డీఆర్‌ఓ లింగ్యానాయక్



మాట్లాడుతున్న డీఆర్‌ఓ లింగ్యానాయక్

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మార్చి15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ముందస్తు ఏర్పాట్లపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతాయని, పరీక్షల నిర్వహణలో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని డీఆర్‌ఓ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 133 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్తు సరఫరా, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీటి వసతులన్నీ ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 62,342 మంది, ఒకేషనల్ కోర్సులో 1,452 మంది మొత్తంగా 63,794 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్లో 54,146 మంది, ఒకేషన్ కోర్సులో 995 విద్యార్థులతో సహా మొత్తంగా 55,141మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా జనరల్లో 1,16,488 మంది, ఒకేషనల్ కోర్సులో 2,447 మంది విద్యార్థులతో సహా మొత్తంగా 1,18,935 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్షల కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 83 ఫిర్యాదులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలతో తరలివచ్చిన ప్రజల నుంచి 83 విజ్ఞప్తులను ఆయన స్వీకరించారు. ప్రజావాణిలో డీఆర్‌డీఏ పద్మజారాణి, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, సీపీఓ మోహన్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సెమినార్‌కు మేడ్చల్ ఉపాధ్యాయురాలు కవిత

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్ ప్రభుత్వ బాలికల పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు ముప్పాళ్ల కవిత రాసిన సెమినార్ పేపర్స్ రాష్ట్ర విద్యా పరిశోధనా సంస్థ(ఎస్‌సీఈఆర్టీ)కు ఎంపికైంది. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర విద్యా పరిశోధనా సంస్థ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాథ్స్ అండ్ సైన్స్ వారు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల సైన్స్ ఉపాధ్యాయుల నుంచి 'ప్రమోటింగ్ ది కల్చర్ ఆఫ్ సైన్స్ టు మేక్ కంట్రీ సెల్ఫ్ రిలయంట్' అనే అంశంపై సెమినార్ పేపర్స్‌ను కోరింది. అందుకు గాను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి ఉపాధ్యాయురాలు కవిత పేపర్స్ ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.మంజూషరాణి, కోపాధ్యాయ బృందంతో సహా జిల్లా సైన్స్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి అభినందించడంతో పాటు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. 'ప్రజా గోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీ భవానీనగర్‌కాలనీలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రీట్‌కార్నర్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నెరవేర్చలేదని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి గాలి సంపత్‌యాదవ్, బీజేపీ అధ్యక్షుడు నాగమల్లారెడ్డి, రవీందర్‌గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'భారత్ జోడో' కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి



కుత్బుల్లాపూర్: భారత్ జోడో యాత్ర కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిందని... మరో మారు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇదే తరహాలో యాత్ర చేస్తామనడం సంతోషంగా ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. సోమవారం దుండిగల్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. ఇటీవల కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన ×రాయ్‌పూర్ డిక్లరేషన్‌లో వెల్లడించిన విధివిధానాలకు అనుగుణంగా పని చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

◆ మహిళా గ్రూపు సంఘాలకు పావలా వడ్డీ రుణాలు ఇస్తూ వడ్డీ లేని రుణాలను మరిచిపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కల్వకుంట్ల ఫ్యామిలీ ప్యాకేజీతో రాష్ట్రాన్ని దివాలా తీశారని దుయ్యబట్టారు. అధికారంలోకి రాగానే అవినీతిపరులను జైలుకు పంపడం ఖాయమని జోస్యం చెప్పారు. ఉద్యమ నాయకుడని కేసీఆర్‌కు అధికారం ఇస్తే ఈ ప్రాంతాన్ని అవినీతి రాష్ట్రంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ నీళ్లు, నిధులు, నియమాకాల పేరుతో తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతోమంది ఉద్యమం చేసి ప్రాణాలు విడిచారన్నారు. కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత కల్వకుంట్ల ఫ్యామిలీ ఈ ప్రాంత అభివృద్ధి పట్టించుకోకుండా ధనార్జన ధ్యేయంగా పని చేస్తోందన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా అవినీతి అక్రమాలు చేస్తూ కోట్లు గడించిందని ఆరోపించారు. 2023లో జరిగే ఎన్నికల్లో తప్పకుండా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి సంపూర్ణ మెజార్టీతో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అబాకస్ కాంపిటీషన్‌లో టీవీఆర్ విద్యార్థుల సత్తా



జీడిమెట్ల: జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహించిన అబాకస్ గ్లోబెల్ లెవెల్ కాంపిటీషన్‌లో అపురూపాకాలనీకి చెందిన టీవీఆర్ మోడల్ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఒక కన్సోలేషన్ బహుమతిని, రూ.500 నగదు పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు. నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందుకున్నారు. టీవీఆర్ విద్యార్థులు జేఎన్‌టీయుహెచ్ స్థాయి అబాకస్‌లో ప్రతిభ కనబరచడం పట్ల స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణరెడ్డి, డైరెక్టర్ సూర రవీంద్రారెడ్డి, టీవీఆర్‌ఎస్ స్కూల్స్ చైర్మన్ కోటిరెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు. అధ్యాపకుల ఉత్తమ శిక్షణతో పాటు విద్యార్థుల కార్యదీక్షతో ఇది సాధ్యపడిందన్నారు. అత్యుత్తమ విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

రిలే నిరాహార దీక్షకు ఎమ్మెల్యే సంఘీభావం

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల ఇండస్ట్రియల్‌లోని సూపర్ మాక్స్ కంపెనీ యాజమాన్యం 7 నెలలుగా కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదు. ఈ సందర్భంగా కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సోమవారం ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కార్మికుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ దీక్ష శిబిరంలో కార్మికులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాంసం వ్యర్థాలు రోడ్లపై పారేయకుండా చర్యలు



విద్యార్థులకు వీధి కుక్కలపై అవగాహన కల్పిస్తున్న యానిమల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యురాలు సాయిశ్రీ

దుండిగల్: చిన్నారులు కుక్క కాటు బారినపడకుండా చర్యలు చేపట్టినట్లు దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు అన్నారు. దుండిగల్ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో సోమవారం మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో వీధి కుక్కల బారిన పడకుండా ఎలా నడుచుకోలన్న దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యానిమల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యురాలు సాయిశ్రీ మాట్లాడారు. చిన్నారులు బయటకు వెళ్లే సమయంలో తల్లిదండ్రులు వారి వెంట ఉండాలన్నారు. వీధి కుక్కలపై రాళ్లు రువ్వడం వంటివి చేయొద్దని కోరారు.

◆ అనంతరం కమిషనర్ సత్యనారాయణరావు మాట్లాడుతూ.. వేసవిలో వీధి కుక్కలు డీహైడ్రేషన్‌కు లోనై వింతగా ప్రవర్తిస్తాయని పేర్కొన్నారు. వాటికి నీళ్లు, ఆహారం అందజేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా మటన్, చికెన్ వ్యర్థాలను రోడ్లపై పారవేయకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే మాంసం దుకాణదారులకు నోటీసులు అందజేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పాఠశాల హెడ్‌మాస్టర్ నళిని, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అక్షయపాత్ర'కు వాహనాలు అందజేత



ఫుడ్ డెలివరీ వాహనాలను అందజేస్తున్న ఎం.ఎస్.ఎన్ గ్రూప్ కంపెనీల చైర్మన్ డా.ఎం.ఎస్.రెడ్డి

గచ్చిబౌలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న అక్షయ పాత్రకు ఎం.ఎస్.ఎన్ గ్రూప్ కంపెనీల చైర్మన్ డాక్టర్ ఎం.ఎస్.రెడ్డి సోమవారం కొండాపూర్‌లోని వైట్ ఫీల్డ్‌లో రెండు ఫుడ్ డెలివరీ వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.ఎన్.రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా అందజేశామని చెప్పారు. పేద విద్యార్థులకు వేడివేడి భోజనం సకాలంలో అందించేందుకు అక్షయ పాత్రతో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.ఎన్.గ్రూప్ డైరెక్టర్లు సింధుజారెడ్డి, నిఖిల్ తేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రపు రుసుంతో ఇళ్ల క్రమబద్ధీకరణ చేయాలి

బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్



ప్రజావాణిలో వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, బీజేపీ నాయకులు

రంగారెడ్డినగర్: జీఓ.59 లబ్ధిదారులకు నామమాత్రపు రుసుంతో ఇళ్ల క్రమబద్ధీకరణ చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జీఓ.59 లబ్ధిదారులకు అందిన డిమాండ్ నోటీసులను పునః పరిశీలించాలని రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

◆ ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. జీఓ.59 కింద పేదల ఇళ్లను క్రమబద్ధీకరిస్తామని గొప్పగా ప్రచారం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తోందన్నారు. పేదలు నివసించే ప్రాంతాల్లో 2014 నాటి మార్కెట్ విలువ కాకుండా ప్రస్తుత మార్కెట్ విలువతో రెవెన్యూ అధికారులు డిమాండ్ నోటీసులు జారీ చేస్తున్నారని విమర్శించారు. దీంతో లక్షల్లో వచ్చిన నోటీసులతో పేదలు బెంబేలెత్తుతున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రజా శ్రేయస్సును మరిచి కేవలం ఖజానాను నింపుకోవడమే పనిగా పెట్టుకుందని దుయ్యబట్టారు.

◆ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ జీఓ.59 లబ్ధిదారులకు న్యాయం జరిగేలా నామమాత్రపు రుసుంతో ఇళ్ల క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బీజేపీ సీనియర్ నాయకుడు చంఢి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గరిగె శేఖర్, భావిగడ్డ రవి, ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు సదానందం, పత్తి రఘుపతి, జిల్లా కార్యదర్శి జగన్‌మోహన్‌రావు, అధికార ప్రతినిధి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.